
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 18 మార్చి 2025





బాపు రామాయణ చిత్రాలకు రంగులు వేస్తున్న దృశ్యం

చకచకా రామయ్య పెళ్లి పనులు

- శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ప్రచారంలో కొత్తపుంతలు
- తొలిసారిగా ఆడియో, వీడియోలతో ప్రచారం
- గోదావరి కరకట్టపై బాపు బొమ్మలకు రంగులు
- గూగుల్ ప్లేస్టోర్‌లో భద్రాద్రి దేవస్థానం యాప్
- స్వామివారి తలంబ్రాల పంపిణీకి ఆర్టీసీ కార్గో కసరత్తు

భద్రాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సమీపిస్తుండడంతో భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 30 నుంచి వసంతపక్ష ప్రయుక్త ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాల ప్రచారంలో దేవస్థానం కొత్తపుంతలు తొక్కుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా కేవలం వాల్‌పోస్టర్లు, పట్టణ ప్రాంతాల్లోని వివిధ ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. కానీ తొలిసారి భద్రాచలం శ్రీరామనవమి ఉత్సవాలపై ఆడియో, వీడియో(ఏవీ)లతో సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. భద్రాద్రి బ్రహ్మోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, భక్తులు భద్రాద్రిటెంపుల్.తెలంగాణ.జీవో.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చయని ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే దేవస్థానం రూపొందించిన ఈ ఏవీ వేల సంఖ్యలో వ్యూస్ దక్కించుకోవడం విశేషం. కాగా మిథిలా స్టేడియ ప్రాంగణంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపం ప్రాశస్త్యాన్ని (మిగతా 6వ పేజీలో)

ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు

ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా అవకాశం 6

ఖమ్మం జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయంలో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరులు పెంచుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీ ప్రకటించడంతో ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో రూ.13.26 కోట్ల వరకు ఆదాయం లభించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 99,745 దరఖాస్తులు చేయగా ఇందులో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర సత్తుపల్లి, వైరా మునిసిపాలిటీల్లో కలిపి 51,425 దరఖాస్తులు ఉన్నాయి. సుడా పరిధిలో ఆయా పంచాయతీల నుంచి 34,393 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు 49,219 దరఖాస్తులకు సంబంధించి ప్రాసెస్ పూర్తిచేయగా మరో 39,381 దరఖాస్తులకు సంబంధించి అనుమతుల ప్రక్రియ వేగంగా సాగుతోంది.



ఖజానాకు ఎల్‌ఆర్‌ఎస్ కిక్



- ఖమ్మం జిల్లాలో చురుగ్గా క్రమబద్ధీకరణ ప్రక్రియ
- రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్ రాబడిలో జిల్లాకు రెండోస్థానం
- ఇప్పటికే సర్కార్‌కు రూ.13.26కోట్ల ఆదాయం
- జిల్లాలో మొత్తం దరఖాస్తులు 99,745
- అనుమతుల దశలో 39,381

ఖమ్మం, మార్చి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 2,421 దరఖాస్తులకు సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు రూ.13.26కోట్లు జమచేశారు. 2020 ఆగస్టు 26కు ముందు ఆయా పంచాయతీలు, పట్టణాల్లో ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లలో పదిశాతం రిజిస్ట్రేషన్ అయిన వెంచర్లలో ఎల్‌ఆర్‌ఎస్‌కు క్లియరెన్స్ ఇస్తున్నారు. ఇందుకోసం ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీలు, మండల తహసీల్దార్ల కార్యాలయాల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తున్నారు ఈనెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ సొమ్ము చెల్లించినవారికి 25శాతం ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో జిల్లాలో దరఖాస్తుదారుల నుంచి స్పందన లభిస్తోంది. 2024 నాటి మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ విలువకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్‌కు చెల్లించాల్సిన సొమ్ము వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలియచేస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ 2020.తెలంగాణ.జీవోవీ.ఇన్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో మొత్తం 705 రియల్‌ఎస్టేట్ లేఅవుట్లు ఉన్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మండల కేంద్రాల్లో కూడా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. అలాగే మండల కేంద్రాలైన బోనకల్‌లో 808 దరఖాస్తులు రాగా 125 దరఖాస్తుల ప్రాసెసింగ్ పూర్తయ్యింది. చింతకానిలో 745 దరఖాస్తులకు 290, కల్లూరులో 2099 దరఖాస్తులకు 398, ఖమ్మంరూరల్ 290 దరఖాస్తులకు 66, కొణిజర్లలో 237 దరఖాస్తులకు 93, కూసుమంచిలో 762కి 90 దరఖాస్తులకు సంబంధించిన ప్రాసెస్‌ను పూర్తి చేశారు. మిగిలిన మండలాల్లోనూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

జీవీఎస్‌వీ ప్రసాద్, డీటీసీపీవో

రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించినందున ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మం డీటీసీపీవో ప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌పై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌లో రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా మొదటిస్థానంలో ఉందని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు జిల్లాలో 99,745 దరఖాస్తులు వచ్చాయని, శిఖం, ప్రభుత్వ భూములు, మున్నేరు బఫర్‌జోన్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని క్రమబద్ధీకరణకు అనువుగా ఉన్న లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేస్తున్నామని తెలిపారు. 2020 ఆగస్టు 26కు ముందు లేఅవుట్‌లోని పదిశాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగి ఉన్న వాటికి మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్‌లో క్రమబద్ధీకరణ చేయించుకునేందుకు అవకాశం కలిపిస్తున్నామని తెలిపారు. అన్నిచోట్ల హెల్ప్‌డెస్కులు ఏర్పాటుచేసి దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తున్నామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ 2020.తెలంగాణ.జీవోవీ వెబ్‌సైట్‌లో మొబైల్‌నెంబరు ఇస్తే ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు వస్తాయని, చెల్లించాల్సిన సొమ్ము కూడా తెలుస్తుందని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని అర్హులైన దరఖాస్తుదారులు ఈనెల 31లోగా సొమ్ము చెల్లించి వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో నూరుశాతం క్రమబద్ధీకరణ లక్ష్యంగా అధికారయంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు.

పంచాయతీరాజ్‌లో

27 మందికి కారుణ్య నియామకాలు

- రేపు నియామక పత్రాలు అందజేయనున్న సీఎం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో కారుణ్య నియామకాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న వారి కల సాకారం కానుంది. వాస్తవానికి ఏటా పదవీవిరమణ తదితర కారణాలతో ఖాళీ అయ్యే పోస్టులను పదోన్నతులతో భర్తీ చేసి కిందిస్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడతారు. ఇటీవలే వయోపరిమితిని 61సంవత్సరాలకు పెంచడంతో పదవీవిరమణ పొందే వారిసంఖ్య తక్కువైంది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి వచ్చే జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జడ్పీ మండల పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బందిలో ఎవరైనా అనారోగ్య కారణాలతో చనిపోతే వారి కుటుంబీకులకు ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. ఇది తీవ్ర జాప్యం అవుతూ వస్తోంది. నాల్గోతరగతి (సబార్డినేట్) పోస్టులు ఉన్న వాటికి చాలా మంది ముందుకు రాలేదు. దీంతో అవి భర్తీ కాలేదు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కోరుకోవడంతో పోస్టులు లేక నిరీక్షించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 27మందిని జూనియర్ అసిస్టెంట్‌లుగా ఎంపిక చేసినట్లు తెలిసింది. వారందరికీ రేపు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందించనున్నారు. ఇందుకోసం అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లేందుకు జిల్లా పరిషత్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పెదవాగు ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోయిన ప్రాంతంలో అధికారులు, రైతులతో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

- పెదవాగు ప్రాజెక్టుకు కేంద్ర నిధులు వచ్చేలా కృషి
- రాష్ట్ర ప్రభుత్వం, మంత్రుల పనితీరు సిగ్గుపడేలా ఉంది
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్
- పెదవాగు, వెంగళరావు ప్రాజెక్టుల పరిశీలన
- గిరిజనులు, రైతులతో సమావేశాలు

చంద్రుగొండ/అశ్వారావుపేట రూరల్/ములకలపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాజెక్టులను పరిశీలించేందుకు సోమవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా చంద్రుగొండ మండలం సీతాయిగూడెం సమీపంలోని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు అలుగును పరిశీలించారు. ఆరు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు ఈ అలుగు పూర్తిగా ధ్వంసమైంది. అప్పటి నుంచి దీన్ని పునర్నిర్మించలేదు. దీనిపై మాజీ మంత్రి జలగం ప్రసాదరావు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన ప్రాజెక్టు, అలుగున ఎస్టీ కమిషన్ సభ్యుడు పరిశీలించారు. అనంతరం జరిగిన రైతు సభలో ఆయన మాట్లాడుతూ గండి వల్ల ప్రాజెక్టులో నీరు నిలవక ఆరు సంవత్సరాలుగా వందలాది ఆదివాసి, గిరిజన రైతులు, మత్స్యకారుల కుటుంబాని ఇబ్బందులు పడుతున్నా గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎందుకు స్పందించటంలేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా పేదలకు అన్నంపెట్టే ప్రాజెక్టుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. నెల రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపకపోతే నీటి పారుదల కార్యదర్శికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసి ఢిల్లీలోని కమిషన్ కార్యాలయానికి పిలిపిస్తామని హెచ్చరించారు. అలాగే ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా పోడు భూములకు పట్టాలు పొందిన రైతుల సమస్యలను పరిష్కరించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి పలు శాఖల జిల్లా, మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టుకు కేంద్రం నిధుల కోసం కృషి

18వేల ఎకరాల ఆయకట్టు కలిగి రెండు రాష్ట్రాల సమస్యగా మారిన పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి 15రోజుల్లో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసి ఢిల్లీకి పిలిపించుకుని అవసరమైన చర్యలు చేపడతామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ తెలిపారు. అవసరమైతే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడతానన్నారు. అశ్వారావుపేట మండలంలో పర్యటించిన ఆయన రెడ్డిగూడెంలో కొండరెడ్లతో సమావేశమయ్యారు. అనంతరం గుమ్మడివల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు లోపల ఉన్న మట్టిని రైతులు తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలని నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రం చొరవతో పెదవాగు ప్రాజెక్టుకు కొన్ని నిధులు మంజూరుకు కృషిచేస్తానని తెలిపారు. తెలంగాణను గత, ప్రస్తుత పాలకులు అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. గిరిజనులకు ట్రైకార్ ద్వారా కుట్టుమిషన్ కూడా కొనుగోలు చేయటానికి నిధులు లేకపోయినా బడ్జెట్‌లో మాత్రం వేలకోట్లు ఇచ్చామని ప్రచారాలు చేయటం దారుణమన్నారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు మాట్లాడుతూ రెండు (మిగతా 6వ పేజీలో)

ముమ్మరంగా

స్వచ్ఛ సర్వేక్షణ్

- వేగం పెరిగిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ నమోదు
- పారిశుధ్య కార్మికులతో ఏఎంసీలో సమావేశం
- ఖమ్మానికి చేరుకున్న ఢిల్లీ బృందం



ఫీడ్‌బ్యాక్ ఆన్‌లైన్ చేస్తున్న ఆర్పీలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షణ్ 2025 అవార్డు కోసం వేగంగా పనులు జరుగుతున్నాయి. ఢిల్లీ బృందం సోమవారం రాత్రికి ఖమ్మానికి చేరుకుంది. మొత్తం 4 బృందాలు ఖమ్మానికి వచ్చాయి. మరోవైపు ఖమ్మం నగరంలోని పారిశుధ్య జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా కేఎంసీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. స్వచ్ఛసర్వేక్షణ్ బృందాల పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన పారిశుధ్య చర్యలపై ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉంటే జవాన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులో 750 మార్కులు అందించే సిటిజన్ ఫీడ్‌బ్యాక్ వేగం పెరిగింది. ఖమ్మం నగరపాలక సంస్థలోని అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు ఫీడ్‌బ్యాక్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీల వద్ద ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఫీడ్‌బ్యాక్ ఓటింగ్ చేపట్టారు. అదేవిధంగా నగరంలోని సీవోలు, ఆర్పీలు ఒక్కొక్కరు 100 టార్గెట్ పెట్టుకొని ఫీడ్‌బ్యాక్ ఆన్‌లైన్ చేపట్టారు. నగరంలోని 60 డివిజన్లలో ఫీడ్‌బ్యాక్ స్కానర్ స్టిక్కర్లను అంటించారు. 50వేలకు పైగా ఫీడ్‌బ్యాక్‌లు ఇవ్వాలని లక్ష్యంగా బృందాలను ఏర్పాటు చేశారు.

అన్నదాతల నేస్తం..

రైతు బజార్

- నూరు శాతం రైతులతో మార్కెట్ నిర్వహణ
- 80 నుంచి100 దుకాణాల సామర్థ్యంతో ఏర్పాటు 6
- ఆధునిక హంగులతో రూ.45 లక్షల కేఎంసీ నిధులతో నిర్మాణం

కుష్టు రహిత

జిల్లానే లక్ష్యంగా..!

- నేటి నుంచి 15రోజులపాటు క్షేత్రస్థాయిలో సర్వే 6
- డాక్టర్ వెంకటరమణ కుష్టు నివారణ అధికారి

రికార్డుస్థాయిలో

పండితాపురం సంత వేలం

రూ.2కోట్ల 42లక్షల 30వేలకు దక్కించుకున్న భూక్య వీరన్న

కామేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలోని పండితాపురంలోని పశువుల సంతను 2025-26కు గాను వేలంపాటలో ఓ వ్యక్తి రికార్డుస్థాయి ధరకు దక్కించుకున్నాడు. పండితాపురం పంచాయతీ ప్రత్యేకాధికారి జి.రవీందర్ అధ్యక్షతన సోమవారం సంత ఆవరణలో ఈ వేలం నిర్వహించారు. వేలంపాటలో అదే గ్రామానికి చెందిన భూక్య వీరన్న, బోడ శ్రీను, బానోత్ లక్ష్మా పాల్గొన్నారు. అధికారులు గతంలో వేలంపాట నిర్వహించగా పాటదారులు రూ.2కోట్ల 35లక్షల 70వేల వరకే పాట పాడారు. దాంతో మద్దతు ధరకు వేలం పాట చేరుకోలేదని వాయిదా వేశారు. మళ్లీ వాయిదా పడ్డ రోజు పలికిన ధర నుంచి వేలం నిర్వహించగా.. ఈ వేలంలో భూక్య వీరన్న రూ.2కోట్ల 42లక్షల 30వేలకు పాట దక్కించుకున్నాడు. ప్రభుత్వం మద్దతు ధర (రూ.2కోట్ల 42లక్షల 1,540) దాటడంతో సంతను భూక్య వీరన్నకు కేటాయిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. వేలం దక్కించుకున్న వ్యక్తి మొత్తం ధరలో మూడోవంతు జమ చేసి సంతను కైవసం చేసుకున్నాడు.వేలంపాట సందర్భంగా కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, రవీంద్రప్రసాద్ పంచాయతీ కార్యదర్శి శంకర్, ఎస్ఐ సాయికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎంపిక

- ఖమ్మానికి నెల్లూరి కోటేశ్వరరావు
- భద్రాద్రికి బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరి బైరెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్డు/ లక్ష్మీదేవిపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ సోమవారం రాత్రి పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఆ పార్టీ ఖమ్మం జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరి కోటేశ్వరరావు, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడికి బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకత్వం సోమవారం రాత్రి ప్రకటన విడుదల చేసిది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు పార్టీ అధ్యక్షులను నియమించగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కూడా కొత్త అధ్యక్షులను ప్రకటించారు. ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన నెల్లూరి కోటేశ్వరరావు వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలంలోని అనంతారం గ్రామానికి చెందినవాడు. ఆయన 2005నుంచి ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. 2014నుంచి 2017 వరకు బీజేపీ వైరా మండల కన్వీనర్‌గా, 2017 నుంచి 2022 వరకు జిల్లా విస్తారక బాధ్యతలు, 2022లో వైరా అసెంబ్లీ కన్వీనర్‌గా, 2023నుంచి 'ప్రజాగోస, బీజేపీ భరోసా' బైక్ ర్యాలీ నిర్వహణ వంటి కీలక బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులు కావడంతో ప్రస్తుత జిల్లా అధ్యకుడు గల్లా సత్యనారాయణతోపాటు పలువురు నాయకులు నెల్లూరికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పాల్వంచకు చెందిన ప్రభాకర్‌రెడ్డి రెండోసారి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి చేపట్టారు.

'జ్యోతి బాపూలే'లో బ్యాక్‌లాగ్ సీట్లకు

20న ప్రవేశ పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతి(ఆంగ్ల మీడియం)లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు ప్రవేశాల కోసం 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా బీసీ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి సిహెచ్ రాంబాబు సోమవారం తెలిపారు. 6వ తరగతిలో బాలికలకు 249, బాలురుకు 294, 7వ తరగతిలో 170 బాలికలకు, 177 బాలురుకు, 8వ తరగతిలో 97 బాలికలకు, 124 బాలురుకు, 9వ తరగతిలో 139 బాలికలకు, 184 బాలురుకు బ్యాక్‌లాగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల బాల, బాలికలు రూ.150 రుసుంతో ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలను కళాశాలలుగా

అప్‌గ్రేడ్ చేయాలి

అసెంబ్లీలో పాట పాడిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ 7

అన్నదాతల నేస్తం.. రైతు బజార్

- నూరు శాతం రైతులతో మార్కెట్ నిర్వహణ
- 80 నుంచి100 దుకాణాల సామర్థ్యంతో ఏర్పాటు
- ఆధునిక హంగులతో రూ.45 లక్షల కేఎంసీ నిధులతో నిర్మాణం
- నాడు జిల్లాలోనే తొలి రైతు బజార్.. గత ప్రభుత్వంలో కూల్చివేత
- అప్పుడు మంత్రి తుమ్మల హయాంలో నిర్మాణం.. ప్రారంభం
- రేపు ప్రారంభించబోయేదీ ఆయనే...


రైతుబజార్‌ను పునః నిర్మించిన దృశ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం సాగు చేసే రైతే మంత్రి అయితే.. పంటల సాగు నుంచి మార్కెట్‌లో అమ్మకాలు జరిపే వరకు రైతుల ఇక్కట్లు తెలిసి పోతాయి. రైతుల బాగోగులు తెలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి రైతు బజార్‌ను ఖమ్మంలో ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రైతుబజార్‌ను కూల్చి వేయటంతో రైతులు రహదారుల వెంట కూర్చొని అమ్మకాలు జరిపారు. తిరిగి వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు రావటంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. రైతుల కోరిక మేరకు దళారులు లేకుండా నూరుశాతం రైతులతో ఆధునిక హంగులతో రైతుబజార్ పునః ప్రారంభానికి సిద్ధమైంది.

జిల్లాలోనే తొలి రైతు బజార్

ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహించిన సమయంలో రైతులు పండించిన పంటలను నేరుగా వారే అమ్మకాలు జరిపేందుకు ఖమ్మం జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ సమీపంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన రైతుబజార్‌ను ప్రారంభించారు. ఖమ్మం నగరంతో పాటుగా సమీప ప్రాంత ప్రజలు సైతం ఇదే రైతుబజార్‌ను కూరగాయలు కొనుగోలు చేయటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే మోడల్ రైతుబజార్‌గా ఆదర్శంగా నిలిచింది.


త్వరలో ప్రారంభం కానున్న రైతుల బజార్

గత ప్రభుత్వంలో కూల్చివేత

ఎంతో ఆదరణ కలిగిన రైతు బజార్ కరోనా సమయంలో కొవిడ్ నిబంధనల మేరకు తొలిసారిగా మూసి వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధాన సెంటర్లలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసే విధానంతో రైతుబజార్‌ను పూర్తిగా 2020లో మూసి వేశారు. తర్వాత కూల్చి వేశారు. రైతు బజార్‌లో ఖమ్మం నగరంతో పాటుగా రఘునాథపాలెం మండలంలోని 90శాతానికి పైగా గిరిజనులు, హరిజనులు, వెనుకబడిన వర్గాల రైతులు తాము పండించిన పంటలను స్వయంగా అమ్మకాలు జరిపే వారు. రైతు బజార్ మూత పడటంతో రైతులు రహదారుల వెంట అమ్మకాలు జరిపారు.

ఆధునిక హంగులతో పునఃనిర్మాణం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావటం, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయటంతో తిరిగి రైతు బజార్ ఏర్పాటుకు ఆశలు చిగురించాయి. రఘునాథపాలెం మండలంలోని గిరిజన, హరిజన, బీసీ రైతులు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తమ గోడు తెలుపుకొన్నారు. మూత పడిన రైతు బజార్‌ను తిరిగి ప్రారంభించి రైతుల జీవితాల్లో సంతోషాన్ని నింపాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మేయర్ పునుకొల్లు నీరజ, 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ, కాంగ్రెస్ నాయకులు వెంకటరమణతో మాట్లాడారు. ఖమ్మం నగర పాలక సంస్థ రూ.45లక్షల నిధులతో అదేప్రాంతంలో తిరిగి నిర్మాణం పూర్తి చేశారు. రైతులకు అనుకూలమైన ప్లాట్ ఫాంలను, మహిళలు, పురుషులకు విడివిడిగా మరుగుదొడ్లు, 100 దుకాణాలకు అనువుగా షెడ్లు, కార్యాలయం గది, కూరగాయల ధరల బోర్డులను ఆధునిక హంగులతో నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఎదురు చూస్తోంది.

గుబ్బలమంగమ్మ ఆలయం వద్ద మైత్రీ మూవీ మేకర్స్ సందడి

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద 'రాబిన్‌హుడ్' సందడి

అశ్వారావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న గుబ్బలమంగమ్మ ఆలయాన్ని సోమవారం మైత్రీ మూవీ మేకర్స్ అధినేత రవి, సినీ డైరెక్టర్ వెంకీ కుడుముల, హీరో నితిన్‌లు సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులతో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అనంతరం మూవీ మేకర్స్ బృందం మాట్లాడుతూ రాబిన్‌హుడ్ సినిమా 19న టీజర్, 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సినిమా ప్రేక్షకుల ఆదరాభిమానాలను తప్పనిసరిగ పొందుతుందన్నారు. త్వరలోనే మెగాస్టార్ చిరంజీవితో ఓ సినిమా చేయబోతున్నట్టు వెంకీ తెలిపారు. వీరితో సినిమా యూనిట్ సభ్యులు ఉన్నారు.


ఆలయం వద్ద హీరో నితిన్

కార్పెంటర్ల బంద్‌ను జయప్రదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో 17 నుంచి 26 వరకు జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కార్పెంటర్స్ జేఏసీ నాయకులు కోరారు. నగరంలోని వర్తక సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కార్పెంటర్ వృత్తిలో కొనసాగుతున్న మేస్త్రీలు ఎదుగూ-బొదుగూ లేని జీవితాలను గడుపుతున్నారని, నిత్యావసర వస్తువుల ధరలతోపాటు, అన్నింటికీ ధరలు పెరిగినా.. చేస్తున్న పనికి మాత్రం రేట్లు పెరగలేదని, పాత రేట్ల ప్రకారమే వృత్తి పనులు చేయడంతో కుటుంబం అంతా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కరోనా తర్వాత అన్ని వస్తువుల రేట్లు రెండింతలు అయినా కార్పెంటర్ల పనులకు మాత్రం ధరలు తగ్గిస్తున్నారని, ఈ విషయాన్ని ఇంటి యజమానులు, బిల్డర్స్ ఆలోచించి సహకరించాలని వారు కోరారు. కార్పెంటర్ల మేస్త్రీలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని బంద్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వర్తకసంఘం భవనం నుంచి మయూరిసెంటర్, పాతబస్టాండ్, అంబేద్కర్ సెంటర్ నుంచి చర్చికాంపౌండ్ వరకు పాదయాత్రగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని తాటికొండ పుల్లయ్య, నందిగామ బ్రహ్మం, దోసోజు లక్ష్మయ్య జెండాను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ మేస్రీలు. వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, దోసోజు పాపాచారి, ప్రధాన కార్యదర్శి దిగజర్ల వెంకన్న, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాణాల వీరబ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి సోమా నాగరాజు కుమార్, కన్వీనర్ బాణాల చిన్న వీరబ్రహ్మాచారి, నగర కార్పెంటర్స్ దూగోడ మిషన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దోసోజు శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి, సండూరి నాగాచారి, కార్పెంటర్స్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పెంటర్లు

కుష్టు రహిత జిల్లానే లక్ష్యంగా..!

- నేటి నుంచి 15రోజులపాటు క్షేత్రస్థాయిలో సర్వే
- డాక్టర్ వెంకటరమణ కుష్టు నివారణ అధికారి


కుష్టుపై సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధుల నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఈ మేరకు జిల్లాలో కుష్టు వ్యాధి బాధితులను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలో 1347ఆశాలలు, ఆరోగ్య కార్యకర్తలతో కుష్టుపై గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో ఆరునెలలకో మారు ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించే వారు. ఇటీవలె గాంధీ వర్ధంతి సందర్భంగా డిసెంబరు, జనవరి నెలలో సర్వే నిర్వహించగా తిరిగి నేటి నుంచి మార్చి 30వరకు ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు జిల్లా కుష్టు నివారణ అధికారులు చెబుతున్నారు.

ఇంటింటి సర్వే..

కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు అన్ని గ్రామాల్లో పట్టణాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి పరీక్షిస్తున్నారు. లక్షణాలు ఉన్న వారిని ఆరోగ్య కేంద్రాలకు తీసుకొచ్చి వైద్యాధికారితో పరీక్షలు చేయిస్తున్నారు. గోధుమ రాగి మచ్చలు ఉన్న వారు ఆరునెలలు, ఐదు నెలల కన్నా ఎక్కువ మచ్చలున్న వారు ఏడాది పాటు మందులు వాడాల్సి ఉంటుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తించే అవకాశం ఉండడంతో గుర్తించిన వెంటనే మందులు వినియోగించాల్సిన ఆవశ్యకత ఉంది. జిల్లాలో 15 లక్షల పైగా కుటుంబాలు ఉన్నాయి. 587 గ్రామ పంచాయతీలు, 1003 గ్రామాల్లో ఇళ్లను అధికారులు సర్వే చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 30 మంది లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు.

సిబ్బంది అడిగిన వివరాలు చెప్పాలి : డాక్టర్ వెంకటరమణ

జిల్లాలో కుష్టు వ్యాధి నియంత్రణే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ కృషిచేస్తుంది. జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అడిగిన వివరాలను ప్రజలు అందించాలి. కుష్టు లక్షణాలు ఉంటే దాచకుండా చెప్పాలి. సకాలంలో చికిత్స పొందితేనే నివారణకు మార్గం సులువవుతుంది.

దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీకి ఏర్పాట్లు

కొత్తగూడెం అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 19న సహాయ ఉపకరణాల పంపిణీకి జిల్లా విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేసిందని జిల్లా విద్యాశాఖ సీఎంవో సైదులు అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ ఆనందఖని కొత్తగూడెంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లతో సంసిద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎంవో మాట్లాడుతూ.. తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్, ఆర్టిఫిషియల్ లింబ్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో) సంయుక్త ఆధ్వర్యంలో గతేడాది ఆగస్టులో జిల్లా విద్యావనరుల కేంద్రం, ఆనందఖనిలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 0నుంచి18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులకు నిపుణులతో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. ఈ పరీక్షల్లో అర్హులను గుర్తించిన 288మంది విద్యార్థులకు రూ.25,89,074 విలువైన 388 రకాల పరికరాలను ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు. ఈనెల 19న బుధవారం జిల్లా విద్యావనరుల కేంద్రంలో కలెక్టర్ జితేష్ ఉపకరణాలను పంపిణీ చేయనున్నారని, లబ్ధిదారులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు (వైకల్యం తెలియజేసేలా), 40శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్టు సదరం సర్టిఫికెట్ లేదా చదువుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ధ్రువీకరణతో ప్రభుత్వ వైద్యుల నుంచి ధ్రువపత్రం, ఆదాయ, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకొని రావాలన్నారు.

ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే..

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రాల మధ్య నలుగుతున్న పెదవాగుకు పూర్వవైభవం వచ్చేలా అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ శ్రీనివాస్, నీటిపారుదలశాఖ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ కృష్ణ, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, వివిధ పార్టీల జిల్లా నాయకులు, ఆయకట్టు రైతులు, గిరిజనులు పాల్గొన్నారు.

అనంతరం ములకలపల్లి మండలం చంద్రుకుంట గ్రామంలో పోడు రైతుల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పోడు భూముల్లో రైతులు వేయించుకున్న బోర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేవంలో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కరించడానికి ఎస్టీ కమీషన్ ఒక కోర్టు లాంటిదన్నారు. ఏ సమస్యనైనా లిఖితపూర్వకంగా తెలిపితే తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. కొండరెడ్లకు ఇచ్చే ప్రతి పథకం 100శాతం సబ్సిడీతో లభిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఫారెస్ట్ భూములకు సంబంధించి పోడు పట్టాలు 70 వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని డీఎస్సీ సమాశం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. పోడు భూములకు పట్టాలకోసం గిరిజనులెవరూ అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేదని, గ్రామాల వారీగా జాబితా తయారు చేసి అర్హులందరికీ పోడు పట్టాలు అందిస్తామని తెలిపారు. కొత్తగా ఎవ్వరూ పోడు కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో జీవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జలగం ప్రసాదరావు, ఆర్డీవో మధుసూదన్, డీఎఫ్‌వో కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బోరును పరిశీలిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

చకచకా రామయ్య పెళ్లి పనులు

(5వ పేజీ తరువాయి)

ఏవీ ద్వారా వివరించే ప్రయత్నం కూడా దేవస్థానం చేపడుతోంది. ఏప్రిల్ ఆరున శ్రీరామనవమి రోజున కల్యాణ మండప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీవీలు, ఎల్ఈడీ స్ర్కీన్ల ద్వారా ప్రసారం చేయనున్నారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల సమయంలో సైతం ఏవిని రూపొందించగగా దానికి అనూహ్య స్పందన లభించింది.

బాపు బొమ్మలకు రంగులు

గోదావరి వరద కరకట్టపై తెలుగుజాతి గర్వించదగ్గ ప్రముఖ చిత్రకారుడు, దర్శకుడు బాపు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన శ్రీరామకథ చిత్రాలకు రంగులు వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. బొమ్మలను శుభ్రం చేసి వాటికి రంగులను వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

గూగుల్ ప్లేస్టోర్‌లో దేవస్థానం యాప్

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తాజాగా భక్తుల కోసం అన్ని రకాల సేవలను ఒకే యాప్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ సోమవారం నుంచి గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులోకి వచ్చింది. భక్తులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని భద్రాద్రి ఆలయానికి సంబంధించిన పలు సేవలను పొందవచ్చని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఆలయ సమయాలు, ఆర్జిత సేవల వివరాలు పొందుపరిచారు. అలాగే దేవస్థానం అందించే సేవలైన అన్నదానం, కల్యాణకట్ట, లడ్డూ కౌంటర్, గోశాల, పర్ణశాల, నేలకొండపల్లి, రామదాసు ధ్యాన మందిరం వివరాలను సైతం అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్, గోదావరి స్నానఘట్టాలు, సీఆర్‌వో, మిథిలా స్టేడియం, కల్యాణ మండపానికి వెళ్లే మార్గం తదితర వివరాలు పొందుపరిచారు. నెల రోజుల్లో పూర్తిస్థాయిలో ఈ యాప్ భక్తులకు అందుబాటులో ఉంటుందని దేవస్థానం అధికార వర్గాలు తెలిపాయి.


ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఈవో

కల్యాణ తలంబ్రాల పంపిణీకి కార్గో సేవలు

రామయ్య కల్యాణ తలంబ్రాలను భక్తులకు చేరవేసేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ అధికారులు భద్రాద్రి దేవస్థానం అధికారులతో సోమవారం చర్చించారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు, భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హరివర్మ, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిలు దేవస్థానం ఈవో ర మాదేవి, ఇతర అధికారులతో చర్చించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

94 గ్రాముల బంగారం రికవరీ వివరాలు వెల్లడించిన ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్

భద్రాచలం మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో గత నెలలో దొంగతనానికి పాల్పడిన కేసులో ఇద్దరు దొంగలను అరెస్టుచేయగా వారి నుంచి 94 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం రాత్రి భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పా టుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. పట్టణంలోని ఇందిరా మార్కెట్ ఏరియాలో ఉన్న ప్రసాద్ కిరాణం షాపులో ఉన్న ఒక మహిళ మెడలో నుంచి బంగారు నాంతాడు, నల్లపూసల గొలుసును ముగ్గురు వ్యక్తులు దొంగతనం చేశారన్నారు. వారిని పట్టుకునేందుకు భద్రాచలం సీఐ బి.రమేష్, ఎస్ఐ రామకృష్ణ రెండు బృందాలుగా ఏర్పాటుచేశామన్నారు. ఈ క్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో సోమవారం మధ్యాహ్న సమయంలో భద్రాచలం పట్టణ ఎస్ఐ బి.రామకృష్ణ పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటుగా ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా వస్తున్న ఒక మోటార్‌సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారిని ఆపే ప్రయత్నం చేయగా వార మోటార్‌సైకిల్‌ను ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసులు కొంత దూరం వెంబడించి వారిద్దరిని పట్టుకొని వారి వివరాలు తెలుసుకున్నారని తెలిపారు. ఈ కేసులో ఏ2గా ఉన్న ఒకరిని ఈ నెల 11న అరెస్టుచేయగా మిగిలిన ఏ1, ఏ3లైన ఇరువురిని తాజాగా అరెస్టుచేసినట్టు ఏఎస్పీ తెలిపారు. వారినుంచి రూ.2లక్షల 35వేల విలువ గల 94 గ్రాముల బంగారాన్ని, దొంగతనానికి వినియోగించిన ఒక ద్విచక్ర వాహనాన్ని, మొబైల్ ఫోన్లు స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవాలని చురుగ్గా వ్యవహరించిన పోలీస్ అధికారులు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

'మధ్య గేటుకు బదులుగా ఆర్‌వోబీ నిర్మించాలి'

ఖమ్మం గాంధీచౌక్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం గాంధీచౌక్‌లోని బడ్జెట్ హోటల్‌లో గుండాల కృష్ణ ఆధ్వర్యంలో 3 టౌన్ పరిరక్షణ కమిటీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ రాజకీయ పార్టీల బాధ్యులతో అత్యవసర సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం మధ్య గేటు 2 నెలలుగా మూసివేస్తూ రాబోయే 6 నెలలు కూడా మూసివేయాలని రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోవడంపై చర్చించారు. దీని వలన 1 టౌన్, 2 టౌన్ (కమాన్ బజార్), 3 టౌన్ (గాంధీచౌక్) మధ్య సంబంధాలు తెగిపోయాయని చర్చించారు. 3 టౌన్ ప్రాంతంలో బంగారు, ఇతర షాపులు ఆర్థికంగా దెబ్బతినటంపై దృష్టిసారించారు. అందరు కలసి మధ్య గేటు ప్రాంతాన్ని ఆర్‌వోబీ లేదా ఆర్‌యూబీ చేయవలసినదిగా ఒత్తిడి చేయుటకు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రఘురామరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, రేణుకాచౌదరిని కలవాలని నిర్ణయించారు. మంళవారం ఉదయం 10 గంటలకు బడ్జెట్ హోటల్ నుంచి పాదయాత్రగా మధ్యగేటుకు చేరుకొని దానిపై రైల్వే స్టేషన్ మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందచేయాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నుంచి సన్నె ప్రతాప్, టీడీపీ నుంచి పెనుగొండ ఉపేందర్, సీపీఐ నుంచి శశిధర్, సీపీఎం నుంచి యర్రా శ్రీకాంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, కిరాణా జాగ్రి మర్చంట్ అధ్యక్షుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రాములోరి కల్యాణ తలంబ్రాలు

ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా అవకాశం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు భద్రాచలంలో ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీసీతారాముల కళ్యాణ తలంబ్రాలను నేరుగా ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకు పంపించే ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరామ్ సోమవారం తెలిపారు. ఒక్కొక్క ప్యాకెట్‌కు రూ.151లను ఆన్‌లైన్ కానీ బస్టాండ్ కౌంటర్ల వద్ద కానీ చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ కోసం ఖమ్మం 9154298583, మధిర 9154298584, సత్తుపల్లి 9154298585, భద్రాచలం 9154298586, కొత్తగూడెం 9154298587, మణుగూరు 9154298588, ఇల్లందు 9154298587 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

'సీతారామా' పరిహారంలో అవకతవకలపై విచారణ

తిరుమలాయపాలెం, మార్చి17(ఆంధ్రజ్యోతి): సీతారామా ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి అందించిన నష్ట పరిహారంలో జరిగిన అవకతవకలపై వరంగల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ సభ్యుడు లక్ష్మణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఓం ప్రకాష్, స్థానిక రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈమేరకు బీరోలు, ఏలువారిగూడెం గ్రామాల్లో విచారణ చేశారు. నివేదికను ప్రభుత్వానికి అందిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని బీరోలు రెవెన్యూ పరిధిలో సీతారామా కింద బావులు, వ్యవసాయ మోటార్లతోపాటు పైపులైన్ల కింద రైతులకు అందించిన పరిహారంలో అవకతవరకలు జరిగాయని ఆరోపిస్తూ బీరోలుకు చెందిన కొప్పుల రామిరెడ్డి విజిలెన్సు డీజీకి ఫిర్యాదుచేశారు. బీరోలు గ్రామానికి చెందిన మిర్యాల విక్రంరెడ్డి, నర్సిరెడ్డి, రామిరెడ్డి పేరుతో సుమారు రూ.50లక్షలు పరిహారం అందుకున్నారని వాస్తవంగా ముగ్గురికి కలిపి ఒక బోరు, ఒక బావి ఉండగా ఎక్కువ మొత్తంలో బావులు, బోర్లు ఉన్నట్టు చూపించి నిధులు స్వాహాచేశారని ఫిర్యాదుచేశారు. ఈమేరకు విజిలెన్సు ఆర్‌డబ్ల్యుఎస్ , రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దుమ్ముగూడెం మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రేగుబల్లి గ్రామశివారు గోదావరి నది ఒడ్డు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం పట్టుకొన్నారు. ఉదయం పాతమారేడుబాకకు చెందిన గుండి చిట్టిబాబు ఇసుకను తరలిస్తున్న క్రమంలో పోలీసులు ఆపి అనుమతి పత్రాలు అడిగారు. చూపించకపోవడంతో ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం పి మారేడుబాకకు చెందిన కుర్సం కనకరాజు ట్రాక్టరులో ఇసుకను నింపుకొని రవాణాకు సిద్దమవగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఇసుకను నింపుకునేందుకు వెళ్లిన తూరుబాకకు చెందిన గుమ్మడి శ్రీను ఖాళీ ట్రాక్టరును సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు ట్రాక్టర్లపై సీఐ అశోక్, ఒక ట్రాక్టరుపై ఎస్ఐ గణేష్‌లు కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోనికి తీసుకున్నారు.

ఆక్రమణల తొలగింపు

దుమ్ముగూడెం మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ములకపాడు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని ఆనుకొని ఆక్రమించిన స్థలంలో ఏర్పాటు చేసిన ద్విచక్రవాహన సీటు కవర్ వ్యాపారులను సోమవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఖాళీ చేయించారు. సదరు వ్యాపారులు తరచూ గొడవలు పెట్టుకొని లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టిస్తున్నందున వీరిపై చర్యలు చేపట్టినట్లు ఆర్ఐ కల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. తొలగింపులో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మొద్దులగూడెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దమ్మపేట పోలీసులు సోమవారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈఘటనలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుంచి రూ.2500 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



కల్లూరులోని ఓ మసీదులో రోజా విరమణ చేస్తున్న ముస్లింలు

సమగ్ర వికాసానికి సంపూర్ణ స్వరూపమే రోజా

మండు వేసవిలో సైతం ముస్లింల కఠోర దీక్ష

కల్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మరోసారి రానే వచ్చింది. మండు వేసవిలో నిండు వసంతాన్ని మోసుకొని, శుభాల సిరులు కురిపిస్తూ, మానవాళి తలుపులు తట్టింది. రంజాన్ మాసంలో రోజాలను (ఉపవాసం) తప్పక పాటించాలి. ఉపవాసాలను విశ్వాసులకు విధిగా నిర్ణయించారు. రంజాన్ నెలలో ఒక నెల రోజుల పాటు ఉపవాసాలు పాటించటం వల్ల దైవంపట్ల భయభక్తులు జనిస్తాయి అని ఖురాన్‌లో ఉంది. మానవుల బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా తెలిసిన అల్లాహ్ రంజాన్ రోజాలను విధిగా నిర్ణయించినప్పటికి కొందరికి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. చిన్న పిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్థులు, వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, మతిస్థిమితం లేని వారికి, రుతుచక్రంలో ఉన్న వారికి రోజా నుంచి మినహాయింపు ఉంది.

రోజా (ఉపవాసం) ఎలా ఉండాలి..

ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం రోజా పాటించేవారు తెల్లవారు జామున అన్నపానీయాలు సేవించాలి. ఆకలిగా లేకపోయిన కొద్దిగానైన తినడం మంచిది. కనీసం మంచినీళ్లైన తాగాలి. దీన్నే సహ్‌రీ అంటారు. తరువాత సూర్యాస్తమయం వరకు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకూడదు. సూర్యాస్తమయం కాగానే రోజా విరమించాలి. దీన్ని ఇఫ్తార్ అంటారు. ఒకవైపు ఉపవాసం పాటిస్తూ మరో వైపు నోటిని గాలికి వదిలివేయడం, విశ్వాసులకు శోభించే లక్షణం కాదు.

ముస్లిం సమాజంలో పురుషులు మసీదులలో సామూహికంగా, మహిళలు స్త్రీలు తమ ఇళ్ల వద్ద సాముహికంగా ప్రత్యేక ప్రార్థనలు ఖురాన్ పఠనంతో అచరించి తమ జీవితాన్ని దైవ మార్గంలో సాఫాల్యం చేసుకుంటారు. స్వర్గంలో ఒక ద్వారం పేరు రయ్యాన్. కేవలం ఉపవాసి మాత్రమే ఈ ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశిస్తారని ప్రవక్త తెలిపారు.

నా విజయం ఉపాధ్యాయ ఆత్మగౌరవ ప్రతీక

- పార్టీకి అనుబంధంగా కాకుండా సమస్యల పోరాటానికి కృషి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ బాధ్యులు

సత్తుపల్లి/ మధిరటౌన్/ పెనుబల్లి/ ఎర్రుపాలెం/ ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా నిరంతరం కృషి చేస్తానని, తన గెలుపు ఉపాధ్యాయ ఆత్మగౌరవానికి ప్రతీక అని నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో ర్యాలీ తీసిన అనంతరం కిరాణా మర్చంట్ కల్యాణ మండపంలో నిర్వహించిన విజయోత్సవ అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ ఎన్నికలో రాజకీయ, కార్పొరేట్ శక్తులను పక్కనబెట్టి ఉపాధ్యాయుడిగా ఉన్న తనని మండలికి పంపించారన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామనని, ఈ క్రమంలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పీఆర్‌టీయూ సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పెండింగ్ బిల్లుల సమస్యల కూడా త్వరలో తీరిపోతుందని, పార్టీకి అనుబంధంగా ఉండకుండా కేవలం ఉపాధ్యాయ సమస్యలకు కొరకే పాటుపడతానని చెప్పారు. అనంతరం పీఆర్‌టీయూ మండల శాఖల ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, మాజీ అధ్యక్షుడు ఎం.మధు, సత్తుపల్లి మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బీ.సుధాకర్‌రెడ్డి, ఎస్. మధుసూదనాచారి, నాయకులు సురేష్, మహేష్, కృష్ణయ్య, రాజశేఖర్‌రెడ్డి, చెన్న కేశవరెడ్డి, రత్నరాజు, సురేష్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

శాసన మండలిలో ఉపాధ్యాయ వాణి వినిపిస్తా..

శాసన మండలిలో ఉపాధ్యాయ వాణిని వినిపిస్తానని ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ శాసన మండలి నియోజవర్గ ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత తొలిసారి మధిర వచ్చిన ఆయనను సోమవారం మధిరలోని టీవీఎం పాఠశాలలో పీఆర్‌టీయూ నాయకులు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పెనుబల్లి మండలం టేకులపల్లిలోని ఆదర్శ పాఠశాలను ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సందర్శించారు. జమలాపురం వెంటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన సీపీఎస్ రద్దు, ఉపాధ్యయుల ఆరోగ్యభద్రతపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

ఎమ్మెల్సీ విజయోత్సవ ర్యాలీ

ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని పురస్కరించుకోని ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు.నూతన కలెక్టరేట్ నుంచి ర్యాలీ ప్రారంభమై నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.



ఖమ్మంలో స్తంభాద్రి నృసింహస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

కనులపండువగా నృసింహుడి గిరి ప్రదక్షిణ

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి(గుట్ట) గిరి ప్రదక్షిణ సోమవారం కనులపండువగా జరిగింది. అర్చక బృందం, దేవాదాయ అధికారులు, భక్తుల ఆధ్వర్యంలో వేలమంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొనగా సాయం త్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. ప్రధాన అర్చకుడు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, అధికారులు, భక్తబృందాల ఆధ్వర్యంలో స్వామి వారి గిరి ప్రదక్షిణ సాగింది. లోక కల్యాణార్థం ప్రతి నెల స్వామి వారి జన్మ నక్షత్రం రోజన గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో, అర్చక బృందం తెలిపారు. ఫిబ్రవరి 18న మొట్టమొదటి సారి ప్రారంభించిన గిరి ప్రదక్షిణకు అనూహ్య స్పందన రావటంతో ప్రతీ నెలా కొనసాగిస్తామని ఈవో తెలిపారు.

దేవస్థానంలో డీఈవో పోస్టు ఏర్పాటుకు కసరత్తు

- ప్రతిపాదనలు పంపిన అధికారులు

భద్రాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(డీఈవో) పోస్టు ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్రంలోని ప్రధాన దేవ స్థానాలైన యాదగిరి గుట్ట, వేములవాడలో డీఈవో పోస్టు ఇప్పటికే ఉండగా భద్రాచలంలో ఇంత వరకు ఆ పోస్టు ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో భద్రాచలం దేవస్థానంలో సైతం ఈ పోస్టును ఏర్పాటు చేయాల్సి ఉన్నట్లు దేవాదాయ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో సైతం డీఈవో పోస్టు ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి కమిషనరు ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు వినికిడి. ఈ పోస్టు భద్రాద్రి దేవస్థానానికి మంజూరైతే కొత్తగా దేవస్థానం పర్యవేక్షణకు మరో కీలక అధికారి నియామకం చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం దేవస్థానంలో ఈవోతో పాటు ఇద్దరు ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్‌లు పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఈ పోస్టు ఏర్పాటుకు ఎప్పుడు ఆమోదం లభిస్తుందనే దానిపై స్పష్టత లేదని తెలుస్తోంది.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

వైద్య ఉద్యోగులకు నియామక పత్రాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): 31 మంది స్టాఫ్ నర్సులు, 33 మంది ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించామని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ తెలిపారు. సోమవారం ఐడీవోసీలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, సూపరింటెండెంట్ సుదర్శన్, జూనియర్ అసిస్టెంట్ చిన్నీజి, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలను కళాశాలలుగా

అప్‌గ్రేడ్ చేయాలి

- అసెంబ్లీలో పాట పాడిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



అశ్వారావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల మాదిరిగా ఆశ్రమ పాఠశాలల్లో కూడా ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టి అప్‌గ్రేడ్ చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచడం హర్షణీయమని అన్నారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షా.. ఓ పాట పాడుతా అంటూ ఆశ్రమ పాఠశాలలపై ఓ పాట పాడారు. తాను ఓ ఆశ్రమ పాఠశాల విద్యార్థినేనంటూ 'ఆలయం ఆలయం దేవాలయం.. ఇది గిరిజన ఆశ్రమ విద్యాలయం ' అంటూ సభలో పాడిన పాటకు సభలోని సభ్యుల చప్పట్లతో అందరి మన్నలను పొందింది. ఈ పాట ద్వార ఆశ్రమ పాఠశాలల ప్రాధాన్యం గురించి వివరించారు.

తెలగవరం మైనర్‌కు సాగునీరు విడుదల చేయాలి

తల్లాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ తెలగవరం మైనర్ కాల్వకు వారబందిని ఎత్తివేసి సాగర్‌జలాలు నిరంతరం సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఎన్నెస్పీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తెలగవరం మైనర్ ఆయకట్టు పరిధిలో సాగునీరందక వరిపైరు ఎండిపోతుందని ఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఐనాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, పులి వెంకటనర్సయ్య, మేడి కృష్ణయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంపై

సామాజిక తనిఖీ

- రూ.1.12 లక్షలు రికవరీకి ఆదేశం

కొణిజర్ల, మార్చి17(ఆంధ్రజ్యోతి): 2023-24 సంవత్సరానికి గాని మండలంలో ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనులపై సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీని నిర్వహించారు. 27 పంచాయతీల పరిధిలో రూ.నాలుగు కోట్లకు పనులు జరగ్గా వాటిల్లో రూ. 56వేల తేడా గుర్తించారు. ఉపాధి పనులు కింద రూ. 2.50 కోట్లకు పనులు జరగగా ద్వారా రూ. 56వేలు తేడాలను తనిఖీ బృందం గుర్తించింది. మొత్తం తేడా రూ. 1.12 లక్షలను గుర్తించి అధికారులు రికవరీకి ఆదేశించారు. ప్రతీ గ్రామంలో కొలతల్లో తేడాలు, కూలి రోజులు ఎక్కువ, తక్కువ, నాటిన చెట్లు చనిపోవడం వంటి వాటిల్లో తేడాలు బయటపడ్డాయి. తేడాలను వేదిక ముందు ఎస్‌ఆర్‌పీ ఆధ్వర్యంలో సీఆర్‌పీలు సేవకరించిన నివేదకలను చదివి వినిపించారు. పెద్దగోపతిలో ఆశవర్కర్‌పై నిబంధనలకు విరుద్ధంగా ఎలా మస్టర్ వేస్తావని అడిషనల్ పీడీ, ప్రొసీడింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఫీల్డ్‌అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. కూలీలకు హాజరుపట్టికలో తేడాలు, కొలతలు వంటి తేడాలు తనిఖీ వేదిక ముందు బయటపడ్డాయి.

గంజాయి పట్టివేత

నలుగురి అరెస్టు

ముదిగొండ,మార్చి 17(ఆంధ్రజ్యోతి): ముదిగొండలో సోమవారం గంజాయి విక్రయిస్తుండగా సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ముదిగొండ నుంచి ఎడవల్లి వెళ్లే రహదారిలో సీఐ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఓ ఖాళీ ప్రదేశంలో నలుగురు యువకులు కొట్టే మధు, బంకా పుల్లారావు, చేకూరి వేణుమాధవ్, బొడ్డు నవీన్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి గంజాయిని తీసుకొని వచ్చి ముదిగొండ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వారు చెప్పారు. నలుగురు యువకుల వద్దనుంచి సుమారు రూ.25వేల విలువైన 500 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళి తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో అదనపు ఎస్‌ఐ కృష్ణప్రసాద్, ట్రెయినీ ఎస్‌ఐ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం మధ్య గేటు వద్ద అండర్ పాస్‌కు రైల్వే మంత్రి హామీ

ఖమ్మంకలెక్టరేట్,మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రైల్వే మధ్య గేటు సమస్యకు శాశ్వత పరిష్కారానికి హామీ లభించినట్లు ఖమ్మం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం పార్లమెంటులో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. ఖమ్మ నగరంలోని గాంధీచౌక్ మధ్యగేటు ప్రాధాన్యతపై ఆయన రైల్వే మంత్రికి వివరించారు. ఎంపీ రవిచంద్ర వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి మధ్య గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం పై సాధ్యాసాధ్యలను పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అంతకు ముందు రైల్వే శాఖపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర గాంధీచౌక్‌గేటు సమస్యను ప్రముఖంగా ప్రస్తావించారు. కమాన్ బజార్, గాంధీచౌక్ ప్రాంతాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలకు ప్రధాన మార్గమైన ఈ గేటు గడిచిన నాలుగు నెలలుగా మూసి ఉంచడం వల్ల వ్యాపార లావాదేవీలు స్థంబించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడోప్లాట్ ఫాం విస్తరణ పనులు వేగం పెంచి తక్షణమే గేటును వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆర్వోబీ లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ఎంపీ రవిచంద్ర పార్లమెంట్‌లో రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అసూయ.. మంత్రాల అనుమానం

కల్లంలో మిర్చి దహనం ఘటనను ఛేదించిన పోలీసులు



నిందితులను రిమాండ్ చేసిన పోలీసులు

పినపాక,మార్చి17(ఆంధ్రజ్యోతి):భద్రాద్రి జిల్లా పినపాక మండలం వెంకట్రావ్‌పేటలో ఈనెల10న గుర్తు తెలియని వ్యక్తులు కల్లంలో మిర్చి దహనం చేసిన ఘటనను పోలీసులు ఛేదించారు. మంత్రాలు ప్రయోగించి భార్య మృతికి కారణమనే అనుమానం.. గ్రామంలో పెద్దమనిషిగా పెత్తనం చెలాయిస్తుండటం తట్టుకోలేక ఈ ఘటనకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. సోమవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన పొనగంటి పురుషోత్తం 50 క్వింటాళ్ల మిరప కాయలను ఇంటి దగ్గరలోని కల్లంలో ఉంచాడు. అదేగ్రామానికి చెందిన తాండ్ర బాలకృష్ణ అతడికి మామ వరుస అయిన మంచర్ల వెంకటేశ్వర్లు ఈనెల10న అర్ధరాత్రి కల్లంలోని మిరపకాయల కుప్పపై పెట్రోల్ పోసి తగలపెట్టారు. మంటలు రావడం గమనించిన స్థానిక రైతులు బాధిత రైతు పురుషోత్తానికి సమాచారం అందించారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాకపోవడంతో బాధిత రైతు బోరున విలపించాడు. బాధితరైతు ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా రంగంలోకి దిగిన ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రాజ్‌కుమార్ సోమవారం మండలంలోని వెంకటేశ్వరపురం వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. మిరప కల్లాన్ని తామె తగలపెట్టినట్లు ఒప్పుకున్నారని సీఐ వెంకటేశ్వరావు, ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. దీంతో పోలీసులను డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

అందుకే తగలపెట్టారు

నిందితుడు తాండ్ర బాలకృష్ణ భార్య ఏడాది క్రితం చనిపోయింది. ఆమె చనిపోవడానికి పురుషోత్తం ఆమెపై మంత్రాలు చేయించాడని అనుమానంతో కక్ష పెంచుకున్నాడు. దానికి తోడు గ్రామంలో పెద్ద మనిషిగా ఎదుగుతూ తమ పనులకు అడ్డువస్తున్నాడని అసూయ చెందాడు. అతడిని ఎలాగైన ఆర్థికంగా దెబ్బ తీయాలని ఈ ఘటనకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. బాధిత రైతుకు సుమారు రూ.10లక్షల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు.

బాధితులకు 48 ఫోన్లు అప్పగింత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న నరేష్‌కుమార్

ఖమ్మంక్రైం, మార్చి17(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న 48మొబైల్‌ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ అడ్మిన్ నరేష్‌కుమార్ తెలిపారు.బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్‌ఫోన్ ట్రాక్ చేసిన ఐటీసెల్ బృందం సీపీ కార్యాలయంలో బాధితులకు ఏడీసీపీ చేతులమీదుగా సోమవారం అందించారు. ఈసందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీటీ రిజిస్టర్‌పోర్టల్ విధానంతో సుమారు 7లక్షల విలువిగల 48ఫోన్లను ట్రేస్‌చేసి యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కో ఫోన్ రూ.10వేల నుంచి లక్షయాభైవేల వరకు ఉన్న ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఈఏడాది ఇప్పటికే 680 మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్నట్టు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు నమోదుకాగా 582 ఫోన్లను రీకవరీచేసినట్టు తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన ఐటీసెల్ నోడల్ అధికారి ఏసీపీ వెంకటేష్, ఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ హేమనాథ్, కానిస్టేబుల్ నరేష్, శ్రీను ను అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట,మార్చి17(ఆంధ్రజ్యోతి):పురుగుల మందు తాగి ఖమ్మం వైద్యశాలలో చికిత్సపొందుతూ ఓవ్యక్తి సోమవారం సాయంత్రం మృతి చెందాడు. దమ్మపేట పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మపేటకు చెందిన పాండ్ల నాగరాజు(40) మద్యానికి బానిసై ఇంటి బాధ్యతలు పట్టించుకోకుండాతిరుగుతున్నాడు. విసిగిపోయి భార్య నాగరాజును మందలించింది. మనస్థాపానికి చెందిన నాగరాజు సోమవారం ఉదయం పురుగులమందు తాగాడు. ఈవిషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పటంతో వైద్యం కోసం ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సత్యవేణి ఫిర్యాదుతో ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

భద్రాద్రి దేవస్థానం పర్యవేక్షకుడిపై దాడి

భద్రాచలం,మార్చి17(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబాపై ఆదివారం దాడి జరిగింది. విధి నిర్వహణ ముగించుకొని ఇంటికి వెళ్లాడు. అనంతరం గతంలో ప్రయివేటు సెక్యూరిటీ ఉద్యోగిగా రామాలయంలో పనిచేసిన ఒక వ్యక్తి మరొకరితో కలిసి వెళ్లి ఆయనపై దాడికి పాల్పడ్డాడు. దర్శనం కోసం ఎనిమిది మందిని తీసుకురావటంపై ఆయన సదరు వ్యక్తిని మందలించాడు. ఈ నేపథ్యంలో దాడిజరిగినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. సాయిబాబా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిని భద్రాద్రి దేవస్థానం వైదిక పరిపాలన ఉద్యోగులు ఖండించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సత్తుపల్లిరూరల్,మార్చి17(ఆంధ్రజ్యోతి):విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన తడికమళ్ల జయమ్మ మనమరాలు అన్నప్రాశన వేడుకకు వెళ్లింది. ఈక్రమంలో ఇంటిలో స్విచ్‌బోర్డ్ వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందుకున్న సత్తుపల్లి ఫైర్ ఎస్‌ఎఫ్‌ఓ వై.వెంకటేశ్వరరావు, ఎల్‌ఎఫ్ ఎం.వెంకటేశ్వర్లు, ఫైర్‌మెన్ ఎం.సతీష్, వీ.సతీష్, డ్రైవర్ కోలా బాబూరావు సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పగా సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. రూ.2లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లకుండా కాపాడినట్లు ఫైర్‌సిబ్బంది తెలిపారు. కాగా బాధితులకు రూ.4వేలు అందించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ. కమల్‌పాషా తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

ఏన్కూరు, మార్చి17(ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. తల్లాడ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన రుద్రాక్షల వినయ్ కుమార్ అనే వ్యక్తి పాల్వంచ పట్టణానికి చెందిన కల్యాణితో కొన్నేళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త మద్యానికి బానిసై తరుచూ కొడుతున్నాడని, ఈనెల5 బుధవారం చేతులతో కాళ్లతో కొట్టి హింసించాడని 6న భార్య ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో చేసిందన్నారు. ఆమె ఫిర్యాదుతో భార్యభర్తలను కౌన్సెలింగ్ చేయడానికి ప్రయత్నించగా భర్త సహకరించలేదని తెలిపారు. అనంతరం 17న ఉదయం పోలీసుస్టేషన్‌కు వచ్చి తనవెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు.గమనించిన పోలీసులు వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బంధువులు ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. వినయ్ పోలీసుస్టేషన్‌లో పోలీసుల విధులకు ఆటకం కలిగించడం, భార్యని హింసించినందుకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు.

రేషన్‌బియ్యం సరఫరా

సూత్రధారిపై కేసు నమోదు

కొణిజర్ల,మార్చి17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం సూత్రదారిపై కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. ఎస్‌ఐ సూరజ్ వివరాల ప్రకారం.. ఈనెల 12న రాత్రి మండలంలోని తనికెళ్ల సమీపంలో గల ఓదాబా వద్ద అక్రమ రేషన్ బియ్యంలోడుతో రెండు లారీలు ఉన్నాయి. ఈసమాచారంతో టాస్క్‌ఫోర్స్, సివిల్‌సప్లయ్, పోలీస్‌శాఖ అధికారులు తనిఖీలుచేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని వైరాఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించారు. రెండులారీల్లో ఒకలారీలో 252 క్వింటాళ్లు, మరో లారీలో 204 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఖమ్మం నుంచి కాకానాడ పోర్ట్‌కు తరులుతున్నాయని, బియ్యాన్ని జగ్గయ్యపేటకు చెందిన జగదీష్ అనే వ్యాపారికి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమరేషన్ బియ్యం వ్యాపారానికి పాల్పడిన జగదీష్‌పై కేసులు నమోదు చేశారు.

బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

అశ్వాపురం మార్చి 17(ఆంధ్రజ్యోతి): మణుగూరు నుంచి బియ్యం అక్రమంగా తరలిస్తున్నలారీని సోమవారం అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. మణుగూరుకు చెందిన ఒక రైస్ మిల్లు నుంచి పాల్వంచకు లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీలో సుమారు 180 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు సమాచారం.

89 క్వింటాళ్లు చోరీ..

కల్లూరు,మార్చి17(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో ఆదివారంరాత్రి రేషన్ బియ్యాన్ని చోరీ చేశారు. రేషన్‌షాపు డీలర్ జి.బిక్షం వివరాల ప్రకారం..కల్లూరులోని పౌరసరఫరాల గిడ్డంగి నుంచి ఆదివారం సాయింత్రం 117 క్వింటాళ్ల రేషన్ బియ్యం దుకాణంలో దిగుమతి చేశారు. సోమవారం ఉదయం రేషన్‌షాపు వద్దకు వెళ్లి చూడగా 180 బస్తాలు కనిపించలేదన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ పి సాంబశివుడు, ఎస్‌ఐ హరిత రేషన్ షాపును సందర్శించారు. చోరీ వివరాలు సేకరించారు. బియ్యం విలువ రూ.2,40,000 లక్షలు ఉంటుందని అంచనా.



రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు చేసుకోండి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 5 లోపు రాజీవ్ యువవికాసం పథకం క్రింద గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మం గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎన్. విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ తెగలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం క్రింద గిరిజన నిరుద్యోగులను స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళిక ఆమోదించిందన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆసక్తి అర్హత ఉన్న నిరుద్యోగ గిరిజన యువత వెబ్సైట్‌లో ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయంలో దూసుకుపోతున్న ఖమ్మం

రూ.10.61 కోట్లకు చేరిన ఆదాయం



ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు రాయితీని ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని 13 మున్సిపాలిటీల్లో ఖమ్మంనగర పాలక సంస్థలో ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం దూసుకుపోతుంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభ రోజుల్లో రోజుకు 3నుంచి ఐదు దరఖాస్తులకు చెల్లింపులు జరిగాయి. కానీ తుదిగడువు ముగిసే వరకు రోజురోజుకు దరఖాస్తుదారుల రద్దీ పెరిగింది. రెండురోజులకు రోజుకు 70 నుంచి80కు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు చెల్లింపులు జరుగుతున్నాయి. దీంతో ఇప్పటికే ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 1,895 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు చెల్లింపులు జరిగి ఆదాయం రూ. 10.61 కోట్లకు చేరింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

ఒకేరోజు రూ.23 లక్షల వసూళ్లు



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ ఆదాయ వసూళ్లలో అరుదైన రికార్డు నమోదైంది. నిత్యం రూ.15లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ట్యాక్స్ కలెక్షన్ జరుగుతుండగా, సోమవారం మాత్రం రూ23లక్షల ఆదాయ వసూళ్లు జరిగాయి. ఇటీవల కాలంలో ఏఎంసీ ఆహ్మద్ షఫీ ఉల్లా రెవెన్యూ కలెక్షన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు టార్గట్ విధించారు. దీంతో ఒకేరోజు రూ.23 లక్షల ఆదాయం వసూళ్లు జరిగినట్లు తెలుస్తోంది. అయితే కమర్షియల్ ప్రాంతాల్లో ఆదాయ వసూళ్ల రాబట్టటంలో విఫలం చెందుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వ్యాపారులు ఆదాయ చెల్లింపులు చేస్తారు. ఆ సమయంలో కేఎంసీ ఉద్యోగులు రెవెన్యూ కలెక్షన్‌కు వెళ్లకపోవటంతో వసూళ్ల జరగటం లేదని తెలుస్తోంది.

నూతన కమిషనర్‌కు సమస్యల స్వాగతం

ఏదులాపురం మునిసిపాలిటీ కమిషనర్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నూతన కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్త కమిషనర్ సారథ్యంలో సమస్యలు పరిష్కరం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. మునిసిపాలిటీ ఏర్పాటు జరిగి సుమారు రెండు నెలలు గడుస్తున్నా... ఎలాంటి అభివృద్ధి కాదుకదా.. కనీస పనులు కూడా జరగటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల పనులకోసం ఎక్కడికి వెళ్లాలి, ఏ అధికారిని కలవాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. అసలు మునిసిపాలిటీ కార్యాలయం ఎక్కడ ఉందో కూడా ఇప్పటికీ ప్రజలకు తెలియదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు..



- ఏదులాపురం మునిసిపాలిటీలో కానరాని అధికారులు
- జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందక ఇబ్బందులు
- మునిసిపల్ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని ప్రజలు

ఖమ్మంరూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీని 12గ్రామ పంచాయతీలతో గతనెల6నఏర్పాటు చేశారు. గత జనవరిలో గెజిట్ జారీ శారు. 69.771 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 56,697 మంది జనాభా, 44,073 మంది ఓటర్లతో ఏర్పాటు చేశారు. మొత్తం 32వార్డులుగా విభజించారు. ప్రస్తుతం గతంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులనే ప్రస్తుతం వార్డు అధికారులుగా కేటాయించారు. ఈమునిసిపాలిటీకి ప్రత్యేకంగా కార్యాలయం లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్నే మున్సిపాలిటీ కార్యాలయంగా వినియోగిస్తున్నారు.

సమస్యలతో సతమతం

మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఏదులాపురం, పెద్ద తండా, గుడిమల్ల, గుర్రాలపాడు, పెద్ద వెంకటగిరి, తెల్దారుపల్లి, మద్దులపల్లి, బారుగూడెం, గొల్లగూడెం, ముత్తగూడెం, రెడ్డిపల్లి, పోలేపల్లి గ్రామాలు విలీనం అయ్యాయి. పారిశుధ్యం, తాగునీరు. తదితర సమస్యలతో సతమతమవుతున్నారు.ఇంటిఅనుమతి, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందించడంలేదు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం లేదు, పాలన అస్తవ్యస్తంగా ఉంది.చెత్త సేకరణ కూడా సరి గా నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పేరుకే మున్సిపల్ పాలన కానీ ప్రజలకు మాత్రం ఎలాంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉండని కార్యదర్శులు

మునిసిపాలిటీ పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో 12మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ప్రజలు వివిధ పనులకోసం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వెళితే కార్యదర్శులు అందుబాటులో ఉండరన్న ఆరోపనలు బలంగా ఉన్నాయి. ఇంటి అనుమతులు, ఇంటి పన్నులు కట్టించుకోడానికి కూడా కార్యదర్శులు కనిపించరని ప్రజలు ఆరోపిస్తున్నారు. వారు ఎప్పుడు కార్యాలయానికి వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి ఉంది.

నూతన కమిషనర్ మార్క్ చూపిస్తారా

ఏదులాపురం మునిసిపాలిటీకి నూతనంగా

బాధ్యతలు చేపట్టిన నూతన కమిషనర్

ఏదులాపురం మునిసిపల్ నూతన కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన కమిషనర్ షఫీఉల్లా ఖమ్మం కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఇల్లెందు మునిసిపల్ కమిషనర్‌గా, తల్లాడ ఎంపీడీఓగా, ఖమ్మంరూరల్ మండలం పెద్ద తండా పంచాయతీ ప్రత్యేకాధికారిగా పని చేశారు. ప్రస్తుతం డీఆర్‌డీఏలో డీపీఎం ఫైనాన్స్ విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను ఏదులాపురం మునిసిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.

బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అయితే మున్సిపాలిటి పరిధిలోని అన్నిగ్రామాల్లోనూ సమస్యలు ఉన్నాయి. కొంతకాలంగా వాటిని పరిష్కరించాల్సినఅధికారులు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సమస్యలు పరిష్కరిస్తారని మున్సిపాలిటి ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

మరణ ధ్రువీకరణ పత్రం కోసం రెండు నెలలు

సానబోయిన శ్రీనివాస్ గౌడ్



మరణ ధ్రువీకరణ పత్రం కోసం రెండునెలలుగా తిరుగుతున్నా మున్సిపాలిటిలో అధికారులు పట్టించుకోవడంలేదు. అంతేకాకుండా ప్రజలకు అవసరమైన ఇంటి అనుమతులు కూడా ఇవ్వడంలేదు. మున్సిపాలిటో ఎవరినో కలవాలో తెలియడం లేదు ఏ అధికారి అందుబాటులో ఉండటంలేదు. కనీసం డ్రెయిన్లు, తాగునీరు, తదితర సమస్యలు తలెత్తుతున్నా పట్టించుకోవడంలేదు. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడే ప్రజలకు పనులు సవ్యంగా సాగాయి.

ప్రజా సమస్యలపై 29న కేఎంసీ ముట్టడి

సీపీఎం డివిజన్ కార్యదర్శి విక్రమ్

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఈనెల 29న ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గాంధీ చౌక్, కమాన్‌బజార్ వీదులకు అనుసంధానంగా ఉన్న రైల్వే మొండిగేటును పూర్తిగా మూసివేశారని, ప్రభుత్వానికి మొండి గేటుపై ముందస్తు ఆలోచన లేదన్నారు. రేషన్‌కార్డులు, అంతర్గత రహదారులు నిర్మాణం, ఇళ్ల స్థలాలు, ఆసరా పింఛన్లు పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు ఎంఏ జబ్బార్, ఎస్‌కే మీరా, వదినేపల్లి శ్రీనివాస్, దొంగల తిరుపతిరావు, భూక్య శ్రీను పాల్గొన్నారు.

చదువుద్వారానే ఉజ్వల భవిష్యత్

తిరుమలాయపాలెం, మార్చి17 (ఆంధ్రజ్యోతి):చదువుద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎస్ఐ జగదీష్ తెలిపారు. సోమవారం మండలంలోని జల్లేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వార్షికోత్సవం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులను ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్,మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. గ్రీవెన్స్‌లో అందించిన ప్రతీదరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ,డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా:

- కూసుమంచి మండలం పెరికసింగారం గ్రామానికి చెందిన ఆదెమ్మ తన భర్త పేరు మీద ఉన్న భూమికి తన ఆడపడుచు నకిలీ పత్రాలు సృష్టించి పాసుపుస్తకాన్ని తీసుకున్నారని ఫిర్యాదు చేసింది.
- ఖమ్మం నగరం దొరన్ననగర్ కు చెందిన నరేష్ దంపతల గొడవలను ఆసరాగా చేసుకొనితనభార్యకు అబార్షన్ చేయించారని దీనిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశాడు.
- టేకులపల్లి కేసీఆర్ టవర్స్ కు చెందిన ఎస్‌.కే. హసీన ఇల్లు పూర్తిగా కాలిపోయిందని, పరిహారం అందించాలని ఫిర్యాదు చేసింది.

వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టాలి

- మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల నివాసాల నుంచి సేకరించే చెత్తను తడి,పొడి, ప్లాస్టిక్ విడివిడిగా సేకరించాలని ఆయా వ్యర్థాలను వినియోగంలోకి తీసుకు రావాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగరంలోని డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. చెత్త తరలింపు ప్రక్రియను పరిశీలించారు. తడిచెత్త ద్వారా సేంద్రియ ఏరువులు తయారీకి కావాల్సిన కార్యచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డంపింగ్‌యార్డులోని 80 వేల టన్నుల చెత్తను శుద్ధి చేసి బయో మైనింగ్ చేపట్టామని, 7ఎకరాలు అందుబాటులోకి రావటంతో అటవీ నర్సరీల పెంపకం బేష్‌గా ఉందని కితాబునిచ్చారు. అటవీ నర్సరీలో 10వేల నుంచి 12వేల మొక్కలు నాటుతున్నామని వివరించారు. నాటిన ప్రతీ మొక్క పెరిగేందుకు తీసుకుంటున్న చర్యలను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

'భుజం మీద భూమి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు కన్నెగంటి వెంకటయ్యచే కవితా సంపుటి భుజం మీద భూమి పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఆవిష్కరించారు. జాషువా సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నగరంలోని న్యూవిజన్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహిత్యం విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య, కవి ఐనాల సైదులు మాట్లాడుతూ కవిలో దాగిఉన్న సాహిత్యాన్ని నేటితరం యువతీ యువకులకు సాహిత్య ప్రేమికులకు అర్థం పట్టే విధంగా చక్కగా వివరించారని అన్నారు. ఈ పుస్తకాన్ని కన్నెగంటి వెంకయ్య జన్మస్థలం లాలాపురం సీపీఎం జిల్లా నాయకులు సంక్రాంతి మధుసూదన్‌రావుకు అంకితం ఇచ్చారు. ఆయన కుమారుడు రవికుమార్‌కు పుస్తకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి మోదుగుల వేలాద్రి, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరస్వామి, చింతనిప్పు చలపతిరావు, షేక్ రంజాన్, రచయితలు కొమ్మవరపు, శ్రీనివాసరావు, శేషగిరి, సునంద, అరుణకుమారి పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన ఏదులాపురం కమిషనర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ గా బాధ్యతల స్వీకరించిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ ను మర్యాదపూర్వకంగా కలిశారు. విధినిర్వహణలో ఏలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలంటూ శ్రీజ సూచించారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నేలకొండపల్లి,మార్చి17(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని భైరవునిపల్లి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు, నేలకొండపల్లిలోని ఓప్రైవేటు స్కూల్ విద్యార్థులకు సోమవారం జరిగిన కార్యక్రమంలో జామెంట్రీ బాక్సులు, స్కేల్స్ పెన్సిల్స్‌ను మండల విద్యాధికారి చలపతిరావు పంపిణీ చేశారు.. ఖమ్మానికి చెందిన శతతారక ఆర్గనైజేషన్ వారు వితరణ చేసారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తాళ్ళూరి బాబూరావు, శతతారక ఆర్గనైజేషన్‌కు చెందిన కృష్ణయాదవ్, మనోజ్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు సయ్యద్ మదార్‌సాహెబ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. 60మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు తదితరాలను ట్రస్టు చైర్మన్ ఇమాం అందించారు. ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో పోట్ల కిరణ్,ట్రస్టుసభ్యులు సైదా, చందు, ఇమాం, అమీర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పదునెట్టాంబడి ప్రతిష్ఠ

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ బైపాస్ రోడ్డులోని చైతన్యనగర్‌లో నిర్మించిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో పదునెట్టాంబడి, ధ్వజస్థంబ ప్రతిష్ఠ బుధవారం జరుగుతుందని ఆలయ చైర్మన్ మేకల హనుమంతరావు తెలిపారు. మాలధారులు శబరిమల వెళ్లలేని స్వాములు ఇక్కడి పదునెట్టాంబడి అయ్యప్ప ఆలయంలో ఇరుముడి అందించవచ్చునని కమిటీ సభ్యులు తెలిపారు.

రుద్రాక్ష ఎగ్జిబిషన్ ప్రారంభం

ఖమ్మంబైపాస్‌రోడ్,మార్చి17(ఆంధ్రజ్యోతి): బైపాస్‌రోడ్‌లోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉగాది పండుగను పురస్కరించుకొని నగర ప్రజలకు కొరకు రుద్రాక్షల ప్రదర్శన ప్రారంభించినట్లు ఓం నేపాలి రుద్రాక్ష సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏకముఖ రుద్రాక్షల నుంచి 21 ముఖముల రుద్రాక్షలు, తులసి మాలలు, సాలిగ్రాములు,కరంగలి మాలలు, దక్షణావృత శంకులు, స్పటిక మాలలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈప్రదర్శన ఈ నెల21 వరకు ఉంటుందని తెలిపారు.



మెప్మా.. ఇవేం గొడవలు చెప్మా

- ఎస్‌హెచ్‌జీ సభ్యురాలిని కొట్టిన ఆర్పీ
- మరోచోట ఇద్దరు ఆర్పీలు పరస్పర దాడులు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలనకు పాటుపడాల్సిన ఖమ్మం నగరంలోని మెప్మా ఆర్పీలు పరస్పర దాడులు చేసుకుంటున్నారు. ఖమ్మం నగరంలోని మెప్మాలో పనిచేస్తున్న కొంత మంది ఆర్పీలు తీరు మెప్మాకు మచ్చ తెచ్చిపెట్టింది. ఇటీవల జరిగిన రెండు సంఘటనలు ఇప్పుడు మహిళా స్వయం సహాయక సంఘాల్లో అభద్రతను పెంచాయి. కైకొండాయిగూడెంలో ఓ సభ్యురాలికి సంబంధించిన ఆర్థిక లావాదేవిలపై సభ్యురాలకు స్థానికంగా ఉన్న ఆర్పీకి ఫోన్‌లో గొడవ జరిగింది. మరుసటిరోజు ఆ సభ్యురాలి సంఘంతో ఆర్పీ సమావేశం ఏర్పాటు చేశారు. ఫోన్‌లో జరిగిన సంభాషణను దృష్టిలో పెట్టుకున్న ఆర్పీ మహిళా సభ్యురాలిపై దాడి చేశారు. ఈ సంఘటన కైకొండాయిగూడెంలోని మహిళా సంఘాల్లో తీవ్ర ఆందోళనకు గురి చేసింది. బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆర్పీ మహిళా స్వయం సహాయక సభ్యురాలిపై దాడి చేయటంపై తోటిసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో ఘటనలో ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతానికి చెందిన ఓ సభ్యురాలు స్త్రీనిధి రికవరీపై ఇద్దరు ఆర్పీల మధ్య వివాదం ఏర్పడింది. ఈ విషయాన్ని అడిగేందుకు ఒక ఆర్పీ మరో ఆర్పీ ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. ఇంకేముంది ఇద్దరు ఆర్పీలు దాడులు చేసుకున్నారు. వారిలోని ఓ ఆర్పీ సెల్‌ఫోన్ పగిలిపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మెప్మా అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ ఘటనలు తమ దృష్టికి రాలేదన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో ముందుండాలి

యాదవ సంఘం అధ్యక్షుడు మన్నె



నేలకొండపల్లి, మార్చి17(ఆంధ్రజ్యోతి): యాదవులు అన్నిరంగాల్లో ముందుండాలని పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు మన్నె కృష్ణారావు అన్నారు. నేలకొండపల్లి పట్టణ శ్రీకృష్ణ యాదవ సంఘం సమావేశం సోమవారం నేలకొండపల్లిలో జరిగింది. సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా మన్నె కృష్ణయాదవ్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుర్రి శ్రీను, మెట్టెల నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా మన్నె కృష్ణారావు, కార్యదర్శిగా మేకల శ్రీను, డైరెక్టర్లుగా రేపాకుల శివ, కూరాకుల సంపత్, మన్నె శ్రీనుఎన్నికయ్యారు. కార్యక్రమంలో గొలుసు రవి, కూరాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టేకులపల్లి మహిళా ప్రాంగణంలో నిరుపేద కుటుంబాలకు చెందిన యువతకు పలు రంగాల్లో శిక్షణ అందిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత అన్నారు. దరఖాస్తుల గడువును ఈనెల 31 వరకు పొడిగించటం జరిగిందని తెలిపారు. ఆధార్ కార్డు, కుల, ఆదాయ, విద్యా అర్హత ధృవపత్రాలు దరఖాస్తుతో పాటు జతచేయాలని తెలిపారు. ఈ శిక్షణ ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 23వడివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ పారిశుధ్య కార్మికులకు రంజాన్ కానుక అందించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్‌లోని కార్మికులకు రంజాన్ తోఫా దుస్తులు, సామాగ్రిఅందించారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తు చేశారు. వారి వల్లే నగరం శుభ్రంగా ఉంటుందన్నారు.



కార్మికులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మక్బూల్

పొట్టి శ్రీరాములు పేరును పునరుద్ధరించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి17(ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయములకు పొట్టి శ్రీరాములు పేరును తొలిగించి ఆర్యవైశ్యులను అవమాన పరిచారని, వెంటనే విశ్వవిద్యాలయాలకు పొట్టి శ్రీరాములు పేరును పునరుద్ధరించాలని ఆర్‌జేసీ కృష్ణ అన్నారు. సోమవారం నగరంలోని కళాశాలలో త్రీటౌన్ కార్పోరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీల వితరణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ. 25వేల విలువగల బెంచీలను సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేట్ ఆధ్వర్యంలో అందించారు. పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా బెంచీలను అందించటం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

అంకమ్మతల్లికి రాయల, తుంబూరు పూజలు

నేలకొండపల్లి,మార్చి17 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామంలో జరుగుతున్న అంకమ్మ తిరునాళ్ళలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి పాల్గొన్నారు. అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను రాయల, దయాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరునాళ్ళను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన న్యాయవాది ఆకుల శేఖర్, వెన్నపూసల సీతారాములు, తుమ్మా దనమూర్తి, కల్లెం కృష్ణారెడ్డి, కుక్కల హనుమంతరావు, మామిడి వెంకన్న, వాకదాని నాగేశ్వరరావు, చీర్ల అంజి, యడవల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జితో ముంపు ప్రమాదం

మధిరటౌన్,మార్చి17(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో మూడో రైల్వే కోసం లడకబజార్‌కు వెళ్లే దారిలో నిర్మిస్తున్న నూతన అండర్ బ్రిడ్జితో నివాస గృహాలు వర్షాకాలంలో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు, స్థానికులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సంవత్సరం ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు లడకబజార్ నుంచి సాయిబాబా గుడి వరకు అనేక ఇళ్లు నీటమునిగాయని అన్నారు. నూతన అండర్ బ్రిడ్జితో మధిర టూటౌన్ లో కూడా ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో దుంపా వెంకటేశ్వరరెడ్డి, దారా బాలరాజు, జహంగీర్, తలుపుల వెంకటేశ్వర్లు, వనజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

» డీఈవో సోమశేఖరశర్మ

పెనుబల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఎలాంటి మానసిక వత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో సోమశేఖరశర్మ సూచించారు. సోమవారం వీఎంబంజర్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పది విద్యార్థుల వీడ్కోలు సభలో డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కామినేని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రశ్నపత్రాన్ని క్షుణ్ణంగా చదవాలని, జవాబులు సూటిగా, సంక్షిప్తంగానూ, సైన్స్, గణితంకు సంబంధించిన మెళకులను, చిత్రాలు వాటి భాగాలను గుర్తించి జవాబులను సకాలంలో రాయాలని సూచించారు. ఎస్ఐ కె.వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.సత్యనారాయణ, సీపీఎం నాయకుడు చలమాల విఠల్‌రావు, మాజీ సర్పంచ్ మంగూనాయక్, పుల్లయ్య, కాంతయ్య, కాటినేని శ్రీను, వంగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించవద్దు

» ఆర్యవైశ్య మహాసభ సంఘం జిల్లా నాయకులు

కల్లూరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు తొలిగించవద్దని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం ఈ మేరకు కల్లూరులోని ఆర్డీవో రాజేంద్రగౌడ్‌కు వారు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు అంకుంఠిత దీక్షతో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరణ నిరాహారదీక్షతో కేంద్ర ప్రభుత్వాన్ని నాడు కదిలించి తెలుగు రాష్ట్రాల ఏర్పాటుకు దోహద పడ్డారని గుర్తు చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పుపై తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు చలువాది నగేష్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనుమోలు శ్రీనివాసరావు, నాయకులు పసుమర్తి రాంబాబు, మిట్టపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

ఇంటివద్దకు ముత్యాల తలంబ్రాలు

» సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిరూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): టీజీఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ ద్వారా రూ.151 చెల్లించినట్లయితే సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలు ఇంటివద్దకే అందిస్తామని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం డీఎం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వెళ్లలేని వారికోసం టీజీఆర్టీసీ లాజిస్టిక్స్ అందిస్తున్న ఈ సదవాకాశాన్ని రామభక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బుకింగ్ చేసుకున్న వారికి రెండు ముత్యాలతో కూడిన తలంబ్రాలు అందిస్తామని చెప్పారు. కావాల్సిన వారు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కే.మునీర్‌పాషా (91542 98585), వీబీవో కిన్నెర ఆనందరావు (98666 19189), సత్తుపల్లి (91542 98594), అశ్వారావుపేట(94942 32424), కల్లూరు(86889 72823), వీఎం.బంజర (73828 58372), అన్నపురెడ్డిపల్లి (97015 73644)సంప్రదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సిలివేరు సాహితీ, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మునీర్ పాషా, వీబీవో ఆనందరావు, సిబ్బంది బాబూరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

'మదర్‌థెరిస్సా'లో ప్రాంగణ నియామకాలు

» 22మంది విద్యార్థులకు ఉద్యోగాలు

సత్తుపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన స్కిల్ ఇన్‌టర్న్‌షిప్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు సోమవారం సత్తుపల్లి మండలంలోని కొత్తూరులోని మదర్‌తెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రాత పరీక్ష, బృంద చర్చలు, ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచిన 22మంది విద్యార్థులను ఎంపిక చేశారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రతి విద్యార్థికి నైపుణ్యతపై ఆసక్తి కలిగించేలా బోధన చేస్తున్నామన్నారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ డా.ఏటీ.శ్రీనివాస్, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌ముస్సేన్, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, కళాశాల చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి. రాఘవరాజు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

వీవోఏల నూతన కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎంపికైన కల్లూరు వీవోఏల కమిటీ

కల్లూరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల వీవోఏల నూతన కార్యవర్గం (ఏఐటీయూసీ) ఎంపిక జరిగింది. సోమవారం వీవోఏల జిల్లా కన్వీనర్ వేము నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. గౌరవఅధ్యక్షుడిగా వేము రాంబాబు, మండల అధ్యక్షురాలిగా జోన్నలగడ్డ కూమారి, కార్యదర్శిగా ఉబ్బన రమాదేవి, ఉపాధ్యక్షురాలిగా జి. కృష్ణవేణి, సహాయకార్యదర్శిగా ఎం. వెంకటరావమ్మ, కోశాధికారిగా ఎం. జ్యోతితోపాటుగా మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎంపికైనారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ నాగమణి ప్రసంగిస్తూ వీవోఏలకు సంబంధించిన జిల్లా, మండల, గ్రామ స్థాయి సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కృషి చేస్తానని చెప్పారు. స్థానికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

మధిర రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అందరూ వ్యతిరేకించాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం మండల కార్యదర్శి చావా మురళీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మడుపల్లి సీపీఐ కార్యాలయంలో రైతుసంఘం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్రప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సూచన మేరకు అన్నిరకాల పంటలకు ఆయా ఖర్చుకు అదనంగా 50శాతం కలిసి మద్దతు ధర నిర్ణయించాలన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.రెండులక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న వైరాలో జరిగే రైతుసంఘం జిల్లా మహాసభలకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వూట్ల కొండలరావు, నాయకులు పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, పంగా శేషగిరిరావు, వూట్ల కామేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను వర్తింపజేయాలి

» ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్

బోనకల్/ వైరా/ తల్లాడ/ పెనుబల్లి/సత్తుపల్లి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను వర్తింపజేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. బోనక్ రెవెన్యూ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి ఏడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వర్తింపు లేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం వల్ల అర్హులైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట హన్మంతరావు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా, మండల నాయకులు తోటపల్లి చిన్న సైదులు, బలవంతపు నర్సింహారావు, మందా అశోక్, ముఖేష్, మరికంటి గంగాధర్, తాళ్లూరి ప్రకాశం, రాజశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణ జీవోకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆరో రోజు సోమవారం వైరాలో ఎంఆర్పీఎస్ రిలే నిరాహారదీక్షలు నిర్వహించింది. టీడీపీ నాయకులు పమ్మి అర్జున్‌రావు, కిలారు సురేందర్, మోత్కూరి వెంకటేశ్వరరావు, మద్దిని రామారావు, చావా కాంతారావు, మన్నేపల్లి ప్రదీప్, వెంకటేష్, మురళీ , బీఆర్ఎస్ నాయకుడు ఆదూరి ప్రేమ్‌కుమార్, మాజీ వార్డు మెంబర్ మోదుగు లక్ష్మయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు.



మాట్లాడుతున్న కూరపాటి సునీల్

● ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో పెనుబల్లిలో జరుగుతున్న రిలే దీక్షలకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం సంఘీబావం తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు దీక్షలో కూర్చొని సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, మోహన్‌రావు, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, అశోక్‌కుమార్, గోవిందరావు, తాతారావు, కోట ప్రభాకర్, తావునాయక్, గోదా శ్రీను, శ్రీను, మరకాల మధు, వెంకీ, చావల వెంకటేశ్వరరావు, శివ పాల్గొన్నారు. దీక్షలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈవీ రమేష్, మండల అధ్యక్షుడు నర్సింహారావు, నరేష్, మధు సంఘీబావం తెలిపారు.

● ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడమే కాకుండా గ్రూప్ 1,2,3,4 వారిగా ఉద్యోగాల్లో నియామకపత్రాలను వర్గీకరణ దామాషా ప్రకారమే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గోళ్లమూడి శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. సోమవారం 6వ రోజుకు చేరిన సత్తుపల్లి దీక్షలో సత్తుపల్లి, పెనుబల్లికి చెందిన ఎస్ఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి అసెంబ్లీలో వర్గీకరణ చేస్తామని, వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు ఉంటాయని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రింగ్‌రోడ్డు సెంటర్లో ఐదోరోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సురేష్, వెంకటేశ్వర్లు, జమలయ్య, అంబేద్కర్, రవి, శ్రీను పాల్గొన్నారు.



లిఖిత సాయిశ్రీకి పురస్కారం అవార్డు బహూకరిస్తున్న దైవజ్ఞశర్మ

లిఖిత సాయిశ్రీకి ఉగాది బాల పురస్కారం

తల్లాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భరతనాట్యంలో అద్భుత ప్రతిభ కనపర్చిన తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన చిన్నారి లిఖితసాయిశ్రీకి ఉగాది బాల పురస్కారం దక్కింది. ఉగాది బాలపురస్కార ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లిఖితసాయిశ్రీకి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞాశర్మ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వడ్డే రామారావు, లీలావతి పాల్గొన్నారు.

జీవో 64ను రద్దు చేయాలి

సత్తుపల్లిరూరల్/ కారేపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల వేతనాల తగ్గింపు జీవో 64ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. సత్తుపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంలో వర్కర్లు చేపట్టిన సమ్మెలో సోమవారం ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. కారేపల్లిలో కూడా సమ్మె విజయవంతం అయింది.

20న వైరాలో రైతు మహాసభలు

వైరా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వతేదీన వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మంజిల్లా 21వ మహాసభలను నిర్వహిస్తున్నామని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నాయకుడు అడపా రామకోటయ్య తెలిపారు. రామకృష్ణ అధ్యక్షతన సోమవారం వైరాలో జరిగిన రైతుసంఘ సమావేశంలో వారు ప్రసంగించారు.

జాబ్‌కార్డులు ఇవ్వాలి

కొణిజర్ల, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పని అడిగిన కూలీలందరికి జాబ్‌కార్డులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం సామాజిక తనిఖీకి వచ్చిన అడిషనల్ పీడీకి వినతిపత్రం అదంజేశారు.

ఎన్నెస్పీ జలాలు అందించాలి

తల్లాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో సాగుచేసిన పంటలకు సాగునీరందేలా కృషిచేయాలని తహసీల్దార్ సురేష్ కోరారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో అధికారులతో సమన్వయసమావేశం నిర్వహించారు.

పకడ్బందీగా సాగు నీటి పంపిణీ

చింతకాని, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి పంపిణీ సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఏడీఏ స్వర్ణ విజయచంద్ర అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో సాగర్ ఆయకట్టు పొలాలను ఆయన పరిశీలించారు. సాగర్ నీటి లభ్యత, నీటి విడుదల తేదీలపై రైతులకు అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఆలయ వార్షిక వేడుకలు

వేంసూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణపురం(తాటాకులగూడెం) గ్రామంలోని శ్రీసత్య అభయాంజనేయస్వామి ఆలయ 19వ వార్షిక వేడుకలు మంగళవారం నుంచి జరుగనున్నాయి.

అడవి మాంసం పట్టివేత

పెనుబల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి మాంసం వండుతున్నారనే సమాచారంతో సోమవారం రాత్రి పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామంలో ఇద్దరు వ్యక్తులపై అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. మాంసాన్ని స్వాధీనం చేసుకొని తల్లాడ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఏజంతువు మాంసమో తేల్చేందుకు ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు.

90మంది రోగులకు వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

వైరా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 90మంది రోగులకు వైద్యసేవలందించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తాతా ఉదయలక్ష్మీకి పీజీలో సీటు రావడంతో ఆమె రిలీవ్ అయి వెళ్లిపోయారు. ఆమె స్థానంలో పెద్దగోపతి పీహెచ్‌సీ డాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన కుటుంబ అవసరాల నిమిత్తం సెలవు తీసుకోవడంతో సోమవరం డాక్టర్ నిర్ణీత సమయానికి వైరా పీహెచ్‌సీకి చేరుకొని సిబ్బందితో కలిసి రోగులకు వైద్యసేవలందించారు.

జేవీఆర్ విద్యార్థికి కంచు పతకం

సత్తుపల్లిరూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే నేషనల్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలలో పట్టణంలోని ద్వారకాపూరి కాలనీకి చెందిన జేవీఆర్ విద్యార్థి నడ్డి ప్రవీణ్ కుమార్ కంచు పతకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.గోపి, కరాటే ట్రైనర్ పిచ్చయ్య, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

'కుష్టు' నిర్మూలనకు కృషిచేయాలి

ముదిగొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారి అరుణాదేవి సూచించారు. జాతీయ కుష్టు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ముదిగొండలో సర్వే, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 17నుంచి 30వతేదీ వరకు సర్వే కార్యక్రమాలు ఆశ కార్యకర్తలు నిర్వహిస్తారని, గ్రామాల్లోని ప్రజలు వైద్యసిబ్బందికి సహకరించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగావకాశాలు

తల్లాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ప్రతిభతో ప్రభుత్వ ఉద్యోగాలను సాధిస్తున్నారని ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్ అన్నారు. సోమవారం తల్లాడ మండలం కుర్నవల్లి జడ్పీఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సభలో ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, ప్రశాంత వాతావరణం, అనుభవం, అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉండటం వల్ల నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీరాణి, పాఠశాల అభివృద్ధి దాతలు అయిలూరి వెంకటకోటారెడ్డి, కేసిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రిని అందజేసిన పాఠశాల బృందం

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వైరా/ కారేపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం హైస్కూల్లోని పదోతరగతి విద్యార్థులకు పూర్వవిద్యార్థులు పరీక్ష సామగ్రిని సోమవారం అందజేశారు. ఈనెల 21నుంచి పది పరీక్షలు జరుగనున్నాయి. పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్స్ తదితర పరీక్ష సామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాస్తూర్బాగాంధీ పాఠశాలలో...

కారేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని సోమవారం ఎంఈవో జయరాజ్ పంపిణీచేశారు. మేకలతండాకు భూక్య వీరన్న,జ్యోతి దంపతుల ఆధ్వర్యం చంద్రు ఫౌండేషన్ ద్వారా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీసౌజన్య, స్వర్ణలత, లక్ష్మణ్, ఎం.స్వాతి, కవిత, విజయలక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

చదువు, సాంకేతికాభివృద్ధికి కృషి: ఎంఈవో

వైరా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చదువు-సాంకేతికాభివృద్ధికి కృషిచేస్తున్నామని వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని రెబ్బవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కూడా అయిన ఎంఈవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం ఆపాఠశాల వార్షికోత్సవం జరిగింది. పూర్వపు ఎంఈవో బండారుపల్లి వెంకయ్య, గ్రామ ప్రముఖులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో షేక్ రిజ్వాన, షేక్ నాగహసీనా ప్రాతినిధ్యం వహించటాన్ని అభినందించారు. పాఠశాల విద్యార్థులు రాసిన మిణుగురులు పేరిట ప్రచురించిన కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ గుత్తా కళావతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఆకుల తులిశమ్మ, కొంగర పురుషోత్తం, గుత్తా శ్రీనివాసరావు, చల్లా సతీష్, మెండెం కృష్ణార్జునరాజు, బండి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు గంగవరపు వెంకట్రావ్, వేదన, సునంద, షఫీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మానవతా విలువలపై బాలికలకు అవగాహన

కొణిజర్ల,మార్చి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజనసంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం బాలికలకు మానవతా విలువలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి కేవీ చంద్రశేఖర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరళ్ల శ్రీనివాస్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజిత, నామవరపు శ్రీనివాసశర్మ, శ్రీరక్ష హాస్పటల్ మేనేజింగ్ డైరక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, వంగూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

సెంటు భూమి కూడా ఎండనివ్వం

వైరా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన చివరి ఆయకట్టులో సెంటు భూమిని కూడా ఎండనివ్వబోమని, సకాలంలో సాగునీరందిస్తామని తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు తెలిపారు. వైరాలోని తమ కార్యాలయంలో సోమవారం సాగునీటి సరఫరాపై వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. రాపల్లి మేజర్ కింద ఎన్నెస్పీ ఆయకట్టులో చివరి భూములకు నీటి సరఫరా గురించి సమీక్షించారు.

భగవద్గీత పారాయణంలో బంగారు పతకం

వైరా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మైసూర్ దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పారాయణం పోటీల్లో వైరాకు చెందిన ప్రముఖ వ్యాపారి రాయపూడి నారాయణరావు సతీమణి రాయపూడి ఉష బంగారు పతకాన్ని సాధించింది. ఆమెను ఆర్యవైశ్య మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం సన్మానించి అభినందించారు. ఆసంఘం మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, దారా వెంకటకృష్ణ, కొల్లా రాంబాబు, జల్లా అవినాష్, సముద్రాల మురళీకృష్ణ, కొల్లా వెంకటసుమన్ సన్మానించారు.

పారితోషికం విడుదల చేయాలి

కారేపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పారితోషికం ఇవ్వాలని బాధ్యులు కోరారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వేతనాలను విడుదల చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

సత్తుపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో డేస్ స్కాలర్స్ 100మంది విద్యార్థుల కోసం సోమవారం నుంచి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్.గోపి తెలిపారు. కళాశాల స్టాఫ్ క్లబ్, సీపీడీసీ సెక్రటరీ డా.మట్టా దయానంద్, లయన్స్‌క్లబ్ ఆఫ్ సత్తుపల్లి, పురప్రముఖుల సహకారంతో 30రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించున్నామన్నారు. సాయంత్రం స్టడీ అవర్స్‌లో పాల్గొనే విద్యార్థుల చదువు కోసం ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు గంధ్ర సోమిరెడ్డి, పెనుగొండ రమేష్, ప్రభాకర్, విజయసారధి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న చందర్‌రావు

కల్లూరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో ఇటీవల మృతిచెందిన ఆర్యవైశ్య నిరుపేద ఇమ్మడిశెట్టి మురళి కుటుంబానికి సోమవారం ఆర్యవైశ్యం సంఘం మండల కమిటీ తరుపున రూ. 90 వేలు నగదును అందజేశారు. మరళి కుటుంబం నిరుపేదది కావటంతో ఆర్థికంగా చేయూత నిచ్చే క్రమంలో సదరు నగదును జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావ, మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు అనుమోలు శ్రీనివాసరావు, చలువాది నగేష్ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతారామారావు, పుల్లారావు, రామారావు, రామకృష్ణరావు పాల్గొన్నారు.